ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 18 | జూన్ | 2024
పేజీలు 7

## త్యాగానికి సామరస్యానికి ప్రతీక బక్రీద్



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

2 లో

## పెట్టుబడుల కోసం ఎదురుచూపు

## నిబంధనావళిపై విస్తృత చర్చ

# రుణమాఫీపైనే ఆశలు..!

**ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.** ఏ పని చేయాలన్న యాంత్రీకరణ నేపథ్యంలో పైకం అవసరం అవుతుంది. విత్తనాల కొనుగోలు ఇతరత్రా అన్నింటికి పెట్టుబడి అవసరమైన నేపథ్యంలో రైతులు రుణమాఫీ పై ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ విషయంలో సాగతీత ధోరణి అవలంభించడం చివరకు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకులు రైతుల అప్పులను రెన్యువల్ చేయకపోగా కొత్త అప్పులు ఇచ్చేందుకు నిరాకరించాయి. అన్నింటికి మించి ఇటీవల కాలంలో వసూళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల పంట రుణాల మాఫీ, రైతుల్లో ఆశలు లేపింది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లోను ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అమలుపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

-ప్రజాపక్షం/ ఖమ్మం

2 లో



### టియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలకు

# ముస్తాబైన ఖమ్మం

## నేడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం




-హాజరు కానున్న మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి
-రేపటి నుంచి మహాసభలు
-ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి, హాజరు కానున్న మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మూడవ మహాసభలకు ఖమ్మం ముస్తాబైంది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఖమ్మం నగరం రాష్ట్ర మహాసభలకు అతిథ్యమివ్వనుంది. రాష్ట్ర మూడవ మహాసభలు ఈనెల 19, 20 తేదీల్లో ఖమ్మంలో అమర్‌నాథ్ ప్రాంగణంలో జరగనున్న విషయం విధితమే.

మిగతా 2లో..

# ఫీజులుం..!

## ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల మోత

- భారీగా పెరిగిన పుస్తకాలు ధరలు
- అడ్మిషన్ ఫీజుల పేరిట భారీ వసూళ్లు
- తలలు పట్టుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో సామాన్యుల పిల్లలు చదవడం కష్టంగానే మారుతోంది. తమ పిల్లలను ప్రైవేటు బడుల్లో చదివించాలనుకునే వారిని ఫీజులు భయపెడుతున్నాయి. దీనిని బట్టి చూస్తే ప్రైవేటు, కార్పోరేట్ స్కూళ్లలో ఫీజుల జులుం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దానికి

మిగతా 2లో..

# రుణమాఫీపైనే ఆశలు..!





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఏ పని చేయాలన్న యాంత్రీకరణ నేపథ్యంలో పైకం అవసరం అవుతుంది. విత్తనాల కొనుగోలు ఇతరత్రా అన్నింటికి పెట్టుబడి అవసరమైన నేపథ్యంలో రైతులు రుణమాఫీ పై ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వం రుణ మాఫీ విషయంలో సాగతీత ధోరణి అవలంభించడం చివరకు రుణ మాఫీ చేయకపోవడంతో బ్యాంకులు రైతుల అప్పులను రెన్యువల్ చేయకపోగా కొత్త అప్పులు ఇచ్చేందుకు నిరాకరించాయి. అన్నింటికి మించి ఇటీవల కాలంలో వసూళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల పంట రుణాల మాఫీ, రైతుల్లో ఆశలు లేపింది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లోను ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన అమలుపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తున్నది. నిబంధనావళి పై ఇప్పుడు విస్తృత చర్చ సాగుతుంది. అసలు రుణమాఫీ ఎవరికి అమలవుతుంది, ఏ మేరకు అమలు చేస్తారన్న దానిపై రైతుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, మంత్రులు దీనిపై తీవ్ర కసరత్తు చేస్తున్నారు. రుణమాఫీకి సంబంధించి వస్తున్న లీకేజీలు రైతులను కలవరపరుస్తున్నాయి. రుణ మాఫీకి సంబంధించి కటాఫ్ డేట్ ఏమిటి అనే దానితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక భారం తగ్గించుకునేందుకు ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రుణమాఫీకి సంబంధించి 2018 నుంచి రెండు లక్షల రుణం తీసుకున్న రైతులకు వర్తింపజేయాలని అది 12 డిసెంబరు 2023ను కటాఫ్ తేదీగా నిర్ణయించాలని అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. ఇదే సమయంలో రేషన్ కార్డు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాలతో కొంత మంది రైతులు రుణం తీసుకోగా మరి కొంత మంది పట్టాదారు పాసుపుస్తకాలు లేకుండా పహాణి నకళ్లు బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకున్నారు. పాసుపుస్తకాలు ఉండి రేషన్ కార్డు లేకపోయినా, రేషన్ కార్డు ఉండి పట్టాదారు పాసుపుస్తకం లేకపోయినా రుణ మాఫీ నిలుపుదల చేయాలని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. తెలంగాణలో భూమి ఉండి ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో నివసిస్తున్న వారికి సైతం గతంలో రైతుబంధు అమలు చేశారు. ఇప్పుడు రుణమాఫీని కూడా అదే రీతిలో అమలు చేస్తే ప్రభుత్వంపై తీవ్ర భారం పడుతుంది. దాదాపు 18 లక్షల మంది రైతులు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ఉండడంతో పాటు రేషన్ కార్డు లేని వారిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పద్ధతిని అమలు చేస్తే కొంత మేర ప్రభుత్వానికి భారం తగ్గుతుందన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. రుణమాఫీకి సంబంధించి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలు చేసి తీరాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేయడం పూర్తి కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులతో కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రైతాంగం గతేడాది నష్టాల కారణంగా తీసుకున్న ప్రైవేటు అప్పులు తీర్చకపోవడంతో కొత్త అప్పులు ఇచ్చే పరిస్థితి లేదు. అటు ప్రైవేటు అప్పులు పుట్టక, ఇటు బ్యాంకు రుణాలు ఇవ్వక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రుణమాఫీ అమలైతే కొత్త అప్పులు తిరిగి ఇచ్చే అవకాశం ఉందని అందుకే రుణమాఫీపై ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం రైతాంగం ఎదురు చూస్తున్నది.

# త్యాగానికి సామరస్యానికి ప్రతీక బక్రీద్



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** త్యాగానికి సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం పట్టణ పరిధిలోని బొడగుట్ట, రుద్రంపూర్ ఈద్గా, మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారతదేశంలో అన్ని పండుగలకు కులమతాలకతీతంగా జరుపుకోవడం హర్షనీయమన్నారు. రాగద్వేషాలు విడనాడి ప్రతిఒక్కరూ సామరస్య భావాలతో కలిసిమెలిసి జీవించాలని తద్వారా సమాజంలో శాంతిని నెలకొల్పాలన్నారు. పేద, ధనిక తారతమ్యలేకుండా పండుగ ఉత్సవాలను అందరూ జరుపుకోవాలని, పండుగలు జరుపుకునే స్థితిలో లేని పేదలకు తమవంతు కర్తవ్యంగా తోడ్పాటును అందించి పండుగ వేడుకల్లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ముస్లీం మైనార్టీలను దేశద్రోహులుగా ముద్రిస్తూ వెలివేసే కుట్రలకు పాల్పడుతుందన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునే నీచ రాజకీయాలకు పాల్పడుతుందని, ఈ కుయుక్తులను కలిసికట్టుగా తిప్పికొట్టాలని, 3.0 మోడీ ప్రభుత్వంతో మరింత ప్రమాదం ఏర్పడుతున్న పరిస్థితిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, ముస్లీం మైనార్టీ నాయకులు, పెద్దలు, నయూమ్ ఖురేషి, షారూఖ్ యజ్డాని, అమీర్, అన్వర్ సాదికుల్లా, హుస్సేన్, ఖలీల్, ఖమర్, ఇబ్రహీం, అయూబ్, ఇక్బాల్, అబ్దుల్ రబ్, గౌస్, షమీఉల్లా,బషీర్, ఆబిద్, యాసిన్, ఇస్మాయిల్, సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎండి.యూసుఫ్, జహీర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# 'ఫీజు'లుం..!




**(మొదటిపేజీ తరువాయి)**

తోడు పుస్తకాలు, యూనిఫాం, బ్యాంగులు, నోటు బుక్స్ ఇలా ప్రతీదీ ఆ స్కూల్లోనే తీసుకోవాల్సి వస్తోంది. బడులు తెరిచే సీజన్ వచ్చిందంటే చాలు తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

**వారిదే ఇష్టారాజ్యం...**

విద్య వ్యాపారంగా మారడంతో కార్పోరేట్, ప్రైవేటు విద్యా సంస్థల వారిదే రాజ్యమైపోయింది. విద్యా సం. ప్రారంభమైందంటే చాలు తల్లిదండ్రుల్లో ధడ పుడుతోంది. ముందునుండే ఖర్చు తగ్గించుకుని కాస్తా కూస్తో కూడబెట్టి వాటిని ప్రైవేటు విద్యాలయాల్లో కట్టాల్సి వస్తోంది. గత ఏడాది కంటే ఈసారి పుస్తకాల ధరలు అమాంతగా 20 శాతం పెరిగాయి. వీటితో పాటు నోటుబుక్స్ ధరలు అదే రీతిలో పెరిగిపోయాయి. ప్రైవేటు విద్యాసంస్థలు నేరుగా వారి బుడుల్లో రకరకాల పేర్లు పెట్టి పుస్తకాలు అమ్మడంతో పాటు నోటు బుక్స్, స్కూల్ పేర్లతో ఉండే బ్యాగులు సైతం విక్రయిస్తున్నారు. అవసరం లేని కొన్ని రకాల పుస్తకాలను వేలాది రూపాయలు పెట్టి కొనిపిస్తున్నారు. అలాంటి పుస్తకాలు బయటి పుస్తకాల షాపుల్లో కొనుగోలు చేస్తే వారు కనీసం 10 నుండి 15 శాతం వరకు తగ్గించి ఇస్తారు. కానీ ఇక్కడ పుస్తకం మీద ఉన్న ధరకు కొనుగోలు చేయాల్సిందే. ఇదిలా ఉండగా కార్పోరేట్ పాఠశాలలు అడ్మీషన్ల పేరుతో భారీ మొత్తాల్లో వసూళ్లు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత జిల్లా విద్యాశాఖ కనీసం నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు. ప్రతీ ఏటా ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థలు దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ అధికారులు ఉలుకుపలుకు లేకుండా ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇతర వసతుల పేరుతో...**

జిల్లాలో కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు నయా దోపిడీని మొదలుపెట్టాయి. తమ వద్ద కొన్ని ప్రత్యేకమైన తరగుతులు, వసతలు, కొత్త ఏసి క్లాస్ రూంలు ఉన్నాయని చెబుతూ పెద్దమొత్తాల్లో వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ పిల్లల భవిష్యత్ బాగుండానే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పుసప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. చిన్నచిన్న తరగతులకో వేలల్లో ఫీజులు గుంజుతున్నారు. విద్యాహక్కు చట్టాన్ని సైతం తుంగలు తోక్కుతున్నప్పటికీ విద్యాశాఖకు చెలనం లేకపోవడం గమనార్హం.

**ఆట స్థలాలు, అగ్నినియంత్రణ చర్యలు శూన్యం...**

జిల్లాలో వందల సంఖ్యలో ప్రైనేటు విద్యాలయాల్లో సరైన ఆట స్థలాలే లేవు. పిల్లకు చదువులతో పాటు ఆటపాటలను సైతం నేర్పించాల్సిన అవసరం ఉందని విద్యాహక్కు చట్టం మొత్తుకుంటోంది. అయినప్పటికీ సరైన ఆటస్థలాలు లేక పిల్లలు ఆడుకునే పరిస్థితి లేదు. మానసికంగా, శారీరకంగా బలపడే పరిస్థితి లేదు. ఇక ఇరుకిరుకు గదులు, బహుళ అంతస్తుల్లో చదువులు చెబుతున్న ప్రైవేటు విద్యా సంస్థలు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నియంత్రించేందుకు సరైన సదుపుయాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో జరగరానిది ఏదైనా జరిగితే పిల్లల పరిస్థితి ఏంటనేది అంతుపట్టదు. ఇన్ని లొసుగులున్న ఉన్నప్పటికీ విద్యాశాఖ మాత్రం బడులు నడుపుకునేందుకు అనుమతులు ఇచ్చేస్తోంది.

**తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు...**

ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల ఫీజులు మోత చూసి తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. ఎల్‌కేజి, యుకేజి పిల్లలకే రూ.20నుండి 30 వేలు వసూళ్లు చేసే ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. ఇదిలా ఉండగా 1 నుండి 5 తరగతులకు రూ.30 వేలు ఆపైన, 6 నుండి 8 తరగతుల వారికి రూ.40 వేలు ఆ పైన, 9,10 తరగతుల వారికి సుమారు రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు పుస్తకాలు, యూనిఫాం, తదితరాలు కలిపి తడిసిమోపెడవుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# టియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలకు
# ముస్తాబైన ఖమ్మం







**(మొదటిపేజీ తరువాయి)**

మహాసభల ప్రారంభానికి ముందు మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి ముఖ్య అతిథిగా మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, ఐజెయు పూర్వ అధ్యక్షులు దేవులపల్లి అమర్, ఐజెయు అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ఎన్ సిన్హా, జాతీయ కార్యదర్శులు వై. నరేందర్‌రెడ్డి, సోమసుందర్, కల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నగునూరి శేఖర్, విరహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ హాజరు కానున్నారు. ఈనెల 19న ప్రారంభమయ్యే మహాసభలను రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనుండగా ప్రారంభ సభలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

**ముస్తాబైన ఖమ్మం...**

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మహాసభలకు ఖమ్మం నగరం ముస్తాబైంది. ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ మహాసభలు జరుగుతున్న అమర్‌నాథ్ ప్రాంగణం (ఉషా హరి కన్వెన్షన్) లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతినిధులకు స్వాగతం చెబుతూ ఖమ్మం పట్టణంలో భారీగా ఫ్లెక్సీలను, స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. ఈ మహాసభలకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులకు, అతిథులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

**హాజరు కానున్న 250 మంది ప్రతినిధులు...**

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మూడవ మహాసభలకు ప్రతినిధులుగా 250 మంది హాజరు కానున్నారు. ఐజెయు జాతీయ నాయకత్వంతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, 11 రాష్ట్రాల నుంచి సౌహార్థ ప్రతినిధులు హాజరు కానున్నారు. ఖమ్మం నగరం మూడు రోజుల పాటు వీరికి అతిథ్యమివ్వనుంది. మహాసభల ఆహ్వాన సంఘం దాదాపు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. సబ్ కమిటీలతో మహాసభ విజయవంతానికి పకడ్బందీ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగుతుంది.

# విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు, పెద్ద కోరుకొండి విద్యుత్ ఉపకేంద్రములలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం విద్యుత్ శాఖ అధికారులు గణేష్, తిరుపతయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వినతులు అందినట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో హై వోల్టేజ్ ,లో వోల్టేజ్, క్యాటగిరీలలో మార్పులు మార్పులు, పేరు మార్పులు, చేర్పులు మార్పులు, పాత సర్వీసులు పునరుద్ధరణ కొన్ని సర్వీసులు రద్దు తదితర అంశాలపై సమస్యలపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు నేరుగా కలిసి లేదా వినతి పత్రం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. నూతనముగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారి పేర్కొన్నారు. నేడు నిర్వహించిన ప్రజావాణిలో కొన్ని సమస్యలు అందాయని, అట్టి సమస్యలను ఆన్లైన్ లో పొందుపరిచి అధికారులకు తెలియ పరిచామని కొన్ని అక్కడికక్కడే పరిష్కరించామని పేర్కొన్నారు.



# పివైఎల్ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మధిర :** జూలై 13, 14 తేదీల్లో మధిర పట్టణంలో ప్రగతి శీల యువజన సంఘం ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అజయ్ తెలిపారు. సోమవారం స్థానిక ధర్మన్న కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయని, యువకులకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 40కోట్లు, రాష్ట్రంలో 30లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడ్డారని తెలిపారు. జూలై 13, 14తేదీల్లో జరిగే శిక్షణా తరగతుల్లో యువత భవిష్యత్, చెడు వ్యాసనాలపై చైతన్యపరుస్తూ ఉపాధి అవకాశాలపై పోరాటాల రూపకల్పన చేయనున్నటు తెలిపారు. ఈ సమావేశంలో పివైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వి.రాకేష్, ఖమ్మంజిల్లా అధ్యక్షులు ప్రేమ్‌సింగ్, నాయకులు సురేష్, సేవాలాల్, దేవా తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా బక్రీద్ వేడుకలు

**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం మైనారిటీ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పినపాక, జానంపేట, ఈ బయ్యారం, దుగినేపల్లి, మల్లారం, జగ్గారం, సింగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ.బయ్యారం, జానంపేట, పినపాక మసీద్‌లలో ముత్తవల్లీల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మికో ఉపన్యాసం చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని, ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా మైనారిటీలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధు మిత్రులతో సంతోషంగా గడిపారు. బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీ ని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.



# రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం గోపాలరావుపేట గ్రామ నివాసి పురిటి మహేష్ కొద్దికాలం క్రితం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా తోగ్గూడెం గ్రామ శివారులో రోడ్డుపై బర్రెలు అడ్డు రావడంతో వాటిని ఢీకొని తీవ్రంగా గాయాల పావ్వగా చికిత్స నిమిత్తం భద్రాచలం హాస్పిటల్ కి తరలించారు. మహేష్ కి జరిగిన ప్రమాద వివరాలు తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కన్వీనర్ అచ్చా నవీన్ తన పెద్ద మనసును చాటుకొని చికిత్స నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. పినపాక మండలంలో ఆపదలో ఉన్నవారికి, అభాగ్యులకు ఎటువంటి కష్టం వచ్చినా అచ్చా నవీన్ స్పందిస్తున్న తీరు పట్ల పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమం లో గోపాలరావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జలగం కనకయ్య, పసల రాము, కొంపెల్లి నాగయ్య, వడ్డె వినోద్, చింతల వెంకన్న, మార్త మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# దుంపా నాగమ్మకు కాంగ్రెస్ నివాళి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దుంపా వెంకటేవ్వరరెడ్డి తల్లి దుంపా నాగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా దశదిన కర్మ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు, బిసిసెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ సెల్ అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, కర్నాటి రామారావు, నిడమనూరి వంశీ, పులిబండ్ల చిట్టిబాబు, బిట్ర ఉందదయ్యా, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బక్రీద్ వేడుకలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పట్టణంలో బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ముస్లిం సోదరుల ఇంట్లో పండుగ వాతావరణం నెలకొన్నది. స్థానిక ఫామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఈద్గా వద్ద ముస్లింసోదరులు అధికసంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లీం సదర్ ముస్లింసోదరులకు ఖురాన్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం స్నేహితులు, బంధువులతో కలిసి ఇంటి వద్ద సిద్ధం చేసిన రుచికరమైన సేమియాలను ఆరగించారు. సాయంత్రం విందు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచటంలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికులకు ఏమిచ్చిన తక్కువేనని, అటువంటి కార్మికులకు ప్రతిఒక్కరూ చేయూతగా నిలవాలని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభరాణి అన్నారు. సోమవారం తన మనవడు యశ్విన్‌రామ్ పుట్టిన రోజు పురస్కరించుకుని 25మంది కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సిహెచ్.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** విద్యుత్ ప్రజావాణిలో విద్యుత్ సమస్యలకు సంబంధించిన వాటిని పరిష్కరించటం జరుగుతుందని సబ్ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని సెంటర్లల్లో ప్రజావాణి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతను బట్టి పరిష్కరిస్తామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో సుమారు 40 దరఖాస్తులకు పైగా వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.



# కల్యాణలక్ష్మీ చెక్కుల అందజేత

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని రైతు వేదిక వద్ద మండల పరిధిలోని 32మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎంపిపి కోపూరి పూర్ణయ్య సోమవారం అందచేశారు. మండల వ్యాప్తంగా 26 గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.32.03లక్షల విలువ గల చెక్కులను అందచేసినట్లు తహశీల్దార్ అనంతుల రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పర్చగాని తిరుపతికిషోర్, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ఘనంగా బక్రీద్ వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఈద్గాల నందు నమాజ్ చదువుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధిర పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు అధికసంఖ్యలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకొరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## బదిలీ కలెక్టర్ గౌతమ్‌కు ఘనసన్మానం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ను నేలకొండపల్లి భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో కలిసి ఘనంగా సన్మానించారు. భక్తరామదాసు చిత్ర పటంను బహుకరించారు. స్తానిక రామదాసు ధ్యాన మందిరం అభివృద్ధి పట్ల కలెక్టర్ చూపిన చొరవ, జయంతి ఉత్సవాల ను ఘనంగా నిర్వహించేందుకు తగిన సహాయ సహకారాలు ను కలెక్టర్ కు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సోసైటీ ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, మన్నె కోటేశ్వరరావు, కర్నాటి శంకర్‌రావు, ఓరుగంటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని వివిధ గ్రామాలలో సోమవారం బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మండలం లోని రాజేశ్వరపురం ఈద్గా వద్ద జరిగిన ప్రార్ధనలో సోందుమియా, సిద్ధయ్య, ఖాదర్‌వలీ, గఫార్, ఖాజా తదితరులు పాల్గొన్నారు. మండలం లోని వివిధ గ్రామాలలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మైశా శంకర్, కడియాల నరేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని తదితర ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా బక్రీద్ పండుగ



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధి లోని ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధి లోని చిన్న కోరుకొండి, వెన్నవల్లి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం, పేరువంచ, బత్తులపల్లి, కల్లూరు తదితర గ్రామాలలో బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. బక్రీదు పండుగ త్యాగానికి ప్రతీక అని సామరస్యం ఐక్యతను పెంపొందిస్తుందని, సమాజంలో సామరస్యం ఐక్యత బంధాలను సుస్థిరం చేస్తుందని, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని బక్రీద్ పండుగ మనకు ఎంతో సంతోషాన్ని సందేశాన్ని ఇస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కప్పల బంధం లోని స్థానిక ఎమ్మెల్యే రాగమయి పాల్గొని ముస్లింలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ప్రముఖులు ఆయా గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు

## ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు



ప్రజాపక్షం/దమ్మపేటః త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదర సోదరీమణులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దమ్మపేట ఈద్గాలో ఈద్ ఉల్ అజహా నమాజ్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మసీద్ ఇమామ్ మహమ్మద్ ఫయాజ్ బక్రీద్ ప్రత్యేక నమాజ్ ను చదివించారు.. ఈ సందర్భఃగా బక్రీద్ ప్రాముఖ్యత గురించి ముస్లిం సోదరులకు వివరించారు. ఈ కార్యక్రమం లో మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ దస్తగీర్, సెక్రెటరీ షేక్ గౌస్, షేక్ షబ్బీర్ అహమ్మద్, షేక్ గోరే, ఎండీ వలీపాషా, అబ్దుల్ జిన్నా, షేక్ బుట్టో, షేక్ రహమాన్, మహమ్మద్ రహీమ్, సయ్యద్ రహీం, కోప్షన్ సభ్యులు షేక్ బుడే తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా,**




ప్రజాపక్షం/బూర్గంపాడు: కార్మికుల సమస్యల పరిష్కారం కోరం నిరంతరం కృషి చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య చారిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సారపాక కపర్తి భవన్‌లో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం సబ్కా నాగేశ్వరారవు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాలని, అలాగే కార్మిక సంఘటిత అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోరకు నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన సారపాకలో జరుగు ఏఐటియూసి జిల్లా మహాసభను జయప్రదం చేయాలన్నారు. దేశంలో మోడీ 44 కార్మిక చట్టాలు రద్దు చెయ్యాలని చూస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకాలు చేసి ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. ఈ విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఏఐటియూసి జిల్లా సీనియర్ నాయకులు కేవి రావు, నియోజకవర్గ కార్యదర్శి పుల్లారెడ్డి, ఏఐటియూసి మండల సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, సిపిఐ మండల కార్యదర్శి మువ్వ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పాండవుల భిక్షం, నాయకులు జహీర్, ముదిగొండ బాలకృష్ణ, ముంతాజ్, వంకాయలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా మిషన్ భగీరథ ఇంటింటి సర్వే





ప్రజాపక్షం/కల్లూరుః గ్రామాల్లో వేగంగా పారదర్శకంగా కొనసాగుతుంది. గ్రామాలలో ఇప్పటికే 60% పూర్తయినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీ ఓ ఏనుగు సురేష్ బాబులు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తీరు 20 రకాల ప్రశ్నలపై సమాధానాలను గృహస్థుల నుంచి తీసుకుంటున్నారు. ప్రతి రోజు కార్యదర్శులు ఇంటింటి సర్వే తో పూర్తిస్థాయి సమాచారాన్ని తీసుకొని యాప్ లో డౌన్లోడ్ అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే చిన్న పంచాయతీలలో సమాచారం పూర్తయినట్లు పేర్కొన్నారు. చిన్న పంచాయతీలలో మర్లపాడు, వెన్నవల్లి, తెలగవరం, లోకవరం, ఓబులరావు బంజర, కిష్టయ్య బంజర, హనుమ తండా , పోచవరం తదితర గ్రామాలలో పూర్తి కావచ్చిందని మరికొన్ని గ్రామ పంచాయతీలలో 60 శాతం పూర్తి కావడంతో ఈ నెల 22వ తేదీ కల్లా పూర్తి చేసి యాప్ లో అనుసంధానం చేయడం జరుగుతుందని జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంచుతామని ఎంపీడీఓ వివరించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బంది, స్థానిక ఉద్యోగులు సహకారంతో ఈ సర్వేను పూర్తి చేస్తున్నట్లు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సర్వేపై సమీక్ష చేసి జిల్లా అధికారులకు తగు సమాచారాన్ని అందిస్తున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు.

## బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు గుండెపోటుతో మృతి

**నివాళులర్పించిన బిజెపి నాయకులు**



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : బిజెపి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండెపోటుతో అకాల మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బోడపట్ల రామచంద్ర 40 ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. బిజెపి పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు కృషి చేశాడు ఇటీవల జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో ఇంటింటి ప్రచార నిర్వహించి బిజెపి అభ్యర్థులకు అత్యధిక ఓట్లు వచ్చేందుకు కృషి చేశాడు. మృతుడు రామచంద్ర కు భార్య కృష్ణవేణి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరితో ఎంతో స్నేహశీలుగా ఉంటూ అందరి మంచితనాన్ని సొంతం చేసుకున్నాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి కుటుంబ పోషణ కోసం శుభకార్యాలకు వంట పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు ఆయన అకాల మృతి చెందడం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రామచంద్ర మృతదేహంపై బిజెపి నాయకులు పుష్పగుచ్ఛ ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్ళపల్లి నరేందర్, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, గుండా శ్రీనివాస్ రెడ్డి, మేక సంతోష్ రెడ్డి, దారమల్లె ఉపేందర్, నల్లగట్టు ఉపేందర్, బోడపట్ల టియుడ బ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు పప్పుల శ్రీనివాస రావు, బోడపట్ల సతీష్, మేకల నాగరాజు, గ్రామ మాజీ సర్పంచ్ ఆలస్యం నాగేశ్వరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకన్న, మాజీ సర్పంచ్ కూసు అప్పారావు తదితరులు నివాళులర్పించారు.

## సాటి మనిషికి సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలి

**జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ**



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి ప్రతి వ్యక్తి త్యాగానికి ప్రాముఖ్యత ఇచ్చి సాటి మనిషికి సహాయం చేసే మనసు అలమరుచుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని వారికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసుల్లో స్వార్థం ద్వేషం విడనాడి సాటి మనిషికి సహాయపడే మనసు అలవర్చుకోవాలని ఆయన కోరారు. హిందూ ముస్లింలు స్నేహపురకంగా ఉంటూ మనసుల మధ్య త్యాగరీతిని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. బక్రీద్ పండుగ ఉద్దేశం బక్రీద్ సారాంశం. హజ్రత్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగను జరుపుకుంటారన్నారు.త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్ పండుగ స్ఫూర్తిగా సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ జానీ జైల లాలు షేక్ సలీం నజీర్ మసూద్ మహబూబ్ పాషా యాకోబ్ పాషా నాగుల మేర ఆఫిద్ రషీద్ జోన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# మేం అడిగిన ఫీజు చెల్లించాల్సిందే..!






**-ఎల్ కేజీకి రూ. 50 వేల నుంచి లక్షల్లో వసూలు**
**-గ్రామాల్లో ఏజెంట్లను నియమించిన ప్రైవేటు విద్యాసంస్థలు**
**-మీ పిల్లలను మా స్కూల్‌కే పంపాలని మొండిగా ప్రవర్తిస్తున్న ఆయా ఏజెంట్లు**
**-అయోమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు**
**-నీకింత .. నాకింత అంటూ బహిరంగంగా చర్చించుకుంటున్న ప్రభుత్వ అధికారులు**

ప్రజాపక్షం/కరకగూడెంః ప్రైవేట్ స్కూల్ లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చదువుకునే రోజులు పోయి చదువును కొనే రోజులు వచ్చినయి. పేదోడి పిల్లవాడిని బడికి పంపుదామంటే సర్కారు బడుల్లో మాస్టర్లు లేక, ఉన్నా సమయానికి రాక, తాగేటందుకు మంచినీళ్లు ఉండక, ఆడపిల్లలు కాలకృత్యాలకు వెళ్లామంటే బాత్రూంలు అసలే లేక గుక్కపట్టి ఓర్చుకోవాల్సిన దుస్థితి. అరె ఇంకేంది ఇన్ని సౌవలత్ లు ఉన్నంక.. ఎవరన్నా వచ్చి గవర్నమెంట్ పాఠశాలకు పొరగాండ్లను తోలుతారని అడిగేటోన్ని దేనితో కొట్టాల్నో మీరె చెప్పాలె. జమ్మి ఆకుతో విస్తరి కుట్టినట్లు ఉంటది రాష్ట్రంలో సర్కారు చదువు పరిస్థితి, పోనీ ఈ సంగతి ఇట్లుంటే.. కూలో నాలో చేసుకునే బతికే భార్యభర్తలు పిల్లలను ప్రయివేటు స్కూల్లో చేర్పిందామంటే బడి గేటు కూడా దాటే పరిస్థితి కానరాట్లేదు. కార్పోరేట్ వ్యవస్థల మాయజాలంతో విద్యావ్యవస్థనే భ్రష్టుపట్టిపోయింది. ఒకవేళ దైర్నం జేసి బర్లో చేర్పిద్దామని వెళ్తే చాలు.. ముందుగాల్నె అడ్మిషన్ పేరుతో వేలల్లో వసూలు చేస్తరు. ఇగ అంతేకాదు ముందుంది ముసల్ల పండగ.. ఎల్. కేజీ నుంచి టెన్త్ క్లాస్ దాకా ఫీజుల జోలి తీసేతట్టు లేదు. కేజీ సెక్షన్ కే రూ.50 వేల నుంచి 1 లక్షకు పైనే కానీ తక్కువ లేదంటే అతిశయోక్తి కాదు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం ఏం జేస్తుంది.. అని మాత్రం అడగొద్దు. విద్యాహక్కు చట్టం 2009 అమలు కావట్లేదా.. ప్రైవేటు స్కూల్స్లో ఫీజు నియంత్రణ లేదా అని క్వశ్చన్ లు వేస్తే.. అబ్బే లేదు.. మేం ఫీజు స్ట్రక్చర్ ఇంకా తయారు చేయలే.. నిమ్మలంగా చేత్తం.. వచ్చే విద్యా సంవత్సరం దాకా ఆగరాదు. తొందరెందుకు అనే సమాధానం వస్తదీ ఎడ్యుకేషన్ బోర్డు నుంచి, ఎలుక తోక తెచ్చి ఎన్నినాళ్ళు ఉతికినా నలుపు నలుపే కానీ తెలుపు కాదు అన్నట్టు ఎన్ని ప్రభుత్వాలు మారిన విద్యా వ్యవస్థ తీరు మారదు అనేది సుస్పష్టం. రాష్ట్రంలో విద్యను ప్రైవేటు పరం జేసింది. ప్రభుత్వం. స్కూల్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అలసత్వం మూలంగా ఫీజు నియంత్రణ లేకుండా పోయింది. నీకింత.. నాకింత అన్నట్టుగాప్రభుత్వ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనేది బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎల్‌కేజి నుంచి టెన్త్ క్లాస్ వరకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ పేద ప్రజల్ని జలగల్లా పట్టిపీడిస్తున్నారు. కార్పోరేట్ సిస్టంలో సామాన్య, మధ్య తరగతి పిల్లలను ప్రైవేటు స్కూల్లో చేర్పించడం కలగానే మిగిలేటట్టు ఉంది. ఎల్ కేజీ సెక్షన్‌కు ఇంత ఫీజు, 1 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి టెన్త్ క్లాస్ దాకా, ఈ విధంగా వసూలు చేయాలని ప్రభుత్వం నిబంధనలు (ఫీజు స్ట్రక్చర్) పెట్టాల్సి ఉంటుంది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 25% కోటా కింద ప్రైవేట్ పాఠశాలలు పేద పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అలాంటి పరిస్థితి ఎక్కడా లేదు. ప్రైవేటు స్కూల్స్ లో కనీస సౌకర్యాలు లేవు.. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం విశాలమైన తరగతి గదులతో కూడిన సొంత భవనం కలిగి ఉండి, ఆట స్థలం ఉన్న పాఠశాలలకు మాత్రమే ఎడ్యుకేషన్ బోర్డు పరిషన్ ఇవ్వాలి. కానీ విద్యాశాఖ అధికారులు మాముళ్లు తీసుకొని ఎలాంటి వసతులు లేకున్నా గానీ స్కూల్, అనుమతులు ఇచ్చేస్తున్నారు. అంతేకాకుండా వాటిపై నియంత్రణ కూడా పెట్టకపోవడం గమనార్హం. 202425 విద్యా సంవత్సరం నేది (జూన్ 12)తో ప్రారంభం అయ్యింది. దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వడు అన్నట్టు కొత్త విద్యా సంవత్సరం వచ్చి స్కూల్స్, స్కూల్ లలో అడ్మిషన్లు పూర్తి అయినప్పటికీ ఇంకా ప్రభుత్వం ఫీజు స్ట్రక్చర్ డిసైడ్ చేయక పోవడం విడ్డూరంగా ఉంది. దీంతో కార్పోరేట్ స్కూళ్లు, అందినకాడికి దోచుకుంటున్నాయి. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. స్కూలు రాధిక ఎక్స్లెంట్ శ్రీవిద్య స్కూల్ లలో 50 వేల రూ. నుండి 80 వేల 1 లక్ష వసూలు చేస్తుండడం గమనార్హం. ఈ ఫీజుల మాటలు వింటుంటే పిల్లల పేరెంట్స్ గుండెల్లో గుబులు మొదలైతుంది. నెత్తిన నోరుంటేనే పెత్తనం సాగుతుంది అన్నట్టు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులకు మామూళ్లు చేస్తున్నరు. కాబట్టి కార్పోరేట్ స్కూల్స్, హవా నడుస్తోంది అనే ఆరోపణలు ఉన్నాయి.తెలంగాణాలో విద్యావ్యవస్థను కార్పోరేట్ కాలేజీలు, స్కూల్స్ సత్తెనాల్ చేశాయి. ఇంత జరుగుతున్నా ఎడ్యుకేషన్ బోర్డు ఏం చేస్తుంది అనేది ప్రశ్న అసలు ఏం జరుగుతుందో తెలియని దుస్థితిలో ఎడ్యుకేషన్ వ్యవస్థ ఉండడం గమనార్హం. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు అనే అపవాది మూటగట్టుకుంటున్నారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ ఎడ్యుకేషన్ బోర్డులో పనిచేసే ఉన్నతాధికారులు కనీసం ప్రైవేటు విద్యా వ్యవస్థను గాడిలో పెట్టకపోవడంపై మేధావులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు చొరవ చూపి కార్పోరేట్ స్కూల్స్, వసూలు చేస్తున్న అధిక ఫీజులను కట్టడిచేసి ఫీజుల నియంత్రణ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు దుర్గం సందీప్, సురేందర్, జాడి ప్రకాష్, జిమ్మిడి జగదీష్, జాడి దినేష్, రితీష్ జాడి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి మారుపేరు నాగరాజు

**- పలు సేవాకార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్**
**- పిలువక పోయినా ముందడుగు**
**- పలువురి మన్ననలు**





ప్రజాపక్షం/భద్రాచలం : మానవత్వానికి మారుపేరుగా నిలుస్తున్నాడు భద్రాచలంకు చెందిన కడాలి నాగరాజు. చిన్న నాటి నుండే సేవా దృక్పదాన్ని అలవర్చుకున్న ఆయన పాఠశాల విద్యాభ్యాసం నుండే ఇరుగు పొరుగువారికి సహకారిగా ఉండటం స్నేహితులు ఆపదల్లో ఉన్నప్పుడు ముందుడి సపర్యలు చేయడం వంటివి చేస్తుంటాడు. ఆయన ఎదుగుతున్నా కొద్దీ తన సేవా కార్యక్రమాలను విస్తరించుకుంటూ వచ్చాడు. ఈ రోజు ఎవరికి ఏ ఆపద వచ్చినా.... అభాగ్యులను ఆస్పత్రులకు చేరవేయాలన్నా, మరెవిరకైనా సహకారం అందించాలన్నా పట్టణ వాసులకు ఠక్కున్న గుర్తుకొచ్చేది నాగరాజే. ఒక్క రూపాయి ఆశించకుండా తన సొంత సమయాన్ని వెచ్చిస్తూ పలువురికి సేవలు అందిస్తున్నాడు. తాజాగా రామాలయం సమీపంలోని శివాలయం వద్ద ఓ వృద్ధుడు కాలు జారి పడిపోవడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. తుంటి ఎముకకు బలమైన గాయం కావడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. రెండు రోజులుగా ఆయనను అక్కడి నుండి కదలలేని పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాంతానికి వచ్చిన కొందరు పట్టణ వాసులకు ఆ వ్యక్తి దుస్థితి కంటపడటంతో వెనువెంటనే కడాలి నాగరాజుకు ఫోన్ చేసి విషయాన్ని చేరవేశారు. ఫోన్ సమాచారాన్ని అందుకున్నదే తడువుగా ఆ వృద్ధుని వద్దకు చేరుకున్న ఆయన అంబులెన్స్‌కు కాల్ చేసి పిలిపించి స్వయంగా ఆస్పత్రికి తరలించాడు. దీనిని చూసిన పలువురు నాగరాజును మరోసారి ప్రశంసిస్తున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుండే నాగరాజు ఎందరికో భోజన సదుపాయాన్ని కల్పిస్తుంటాడు. అవసరాన్ని బట్టి మిత్రులు, పురప్రముఖల సహాయసహకారాలతో ఆర్థిక సహకారాన్ని అందజేస్తుంటాడు. ఇదిలా ఉండగా గురువారం సాయిబాబా గుడిలో, మంగళవారం అంజనేయ స్వామి గుడిలో బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో, శనివారం వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సైతం భక్తులకు సేవలందిస్తుంటాడు. ప్రధానంగా మహిళా భక్తులు, చిన్న పిల్లలతో ఉండే భక్తులు ఇబ్బందులు పడకుండా ఆయన సహాయ సహకారాలు అందిస్తూ వారి మన్ననలను సైతం పొందుతుంటాడు. ఆయన రాబోయే రోజుల్లో మరిన్న సేవా కార్యక్రమాలు నిర్విహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/గుండాల : ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమ పోరాటాల ద్వారానే పరిష్కరింప బడతాయని న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు ,ఎంపిపి ముక్తి సత్యం అన్నారు. సోమవారం మండల పరిదిలోని కొడవటంచ గ్రామంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొడవటంచ,నాగారం, పాలగూడెం గ్రామాల ప్రజలు వర్షాకాలం వస్తే దినదిన గండంగా గడిపే పరిస్థితి నెలకొందని కినెరసాని,ఏడుమెలికల వాగుపై ఉన్న లోలెవెల్ వంతెనను హైలెవెల్ వంతెనను నిర్మించాలని,ఏడుమెలికల వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పై వేసిన ఇసుక మేటను తొలగించాలని, కొడవటంచ గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్ మరియు జిసిసి ద్వారా రేషన్ షాపు ఏర్పాటు చెయ్యాలని స్తానిక ఎమ్యెల్యేకు, జిల్లా ఉన్నాతాదికారులకు ఎన్నో మార్లు విన్న వించిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలకు న్యాయ చెయ్యాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యామాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టి నాయకులు పర్షక రవి, ఎర్రయ్య, యానయ్య, మల్లయ్య, రమేష్, వసంతరావు, గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రోమోర్ సెంటర్ ప్రారంభం




ప్రజాపక్షం/గుండాల : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రోమోర్ సెంటర్‌ను సోమవారం ఏడిఎ తాతారావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఏడిఎ మాట్లాడుతూ మన గ్రోమోర్ సేవలను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. రైతులకు రాబోవు ఖరీఫ్‌కు పలు సూచనలు చేశారు. అలాగే కోరమండల్ కంపెని ఏజిఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రోమోర్ సెంటర్‌లో రైతులకు సరసమైన ధరలకు నాన్యమైన ఎరువులు,పురుగుమందులు, విత్తనాలు ఈ సెంటర్‌లో కంప్యూటర్ బిల్లుద్వార అమ్మకాలు జరుగుతాయనిలన్నారు. అంతే కాకుండా గ్రోమోర్ సెంటర్ ద్వార భూసార పరీక్షలు , వ్యవసాయ సలహాలు కూడ ఇస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అథిదులుగా ఏఒ వెంకటరమణ, ఏరియా మేనేజర్ క్రిష్ణయ్య, కంపని ప్రథినిదులు , సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు..!

**-ప్లాట్లుగా మ్యాప్‌లు ఏర్పాటు**
**-డిటిసిపి అనుమతులు ఎక్కడ?**
**-అనుమతులు లేని ప్లాట్లు రిజిస్ట్రేషన్లు?**
**-పెద్ద ఎత్తున ఆదాయానికి గండి**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో డిటిసిపి లేఔట్ అనుమతులు లేకుండానే ప్లాట్లు చేసి పెద్ద ఎత్తున విక్రయిస్తున్నరు. వ్యవసాయభూములను కొనుగోలు చేయడం ఆ తర్వాత రియల్ వ్యాపారం కోసం ప్లాట్లు ఏర్పాటు చేయడం ఇలా మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నా పరిస్థితి వైరా మున్సిపాలిటీలో ఉంది. ప్రభుత్వ డిటిసిపి అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. వైరా మున్సిపాలిటీ పరిధిలోని న్యూప్లవర్ దిద్దిపూడి సమీపంలో కొతమంది అక్రమ లేఅవుట్లను అనాధికారికంగా ఏర్పాటు చేసి ప్లాట్ల మ్యాప్‌ను గీసి గుట్టుచప్పుడుగా ఎవరికి అనుమానం రాకుండా విక్రయాలు చేస్తున్నారు. మరికొందరు ఆ ప్లాట్లను గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ కూడా చేపిస్తున్నట్లు సమాచారం. వైరా మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొంతమంది ఎంచుకొని వారి ఇష్టానుసారం లేఔట్లు అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా ఏర్పాటు చేసి దానికి సంబంధించి మ్యాప్‌లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి సక్రమంగా అందుబాటులో లేకపోవడం ఎవరు ఎలాంటి అనుమతులు తీసుకున్నారు. తెలియని పరిస్థితి కూడా ఏర్పడింది. గతంలో అనుమతులు లేకుండా వెంచర్లు వేసిన వాటిపై అధికారులు కొరడాలు ఝులిపించారు. ఈ క్రమంలో గడిచిన కొన్ని నెలలుగా అక్రమ లేఔట్ నిర్మాణం జోరుగా కొనసాగుతుంది. కొంతమంది ఈ ప్లాట్లు అనుమతులు తీసుకోకుండా ఇటు మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ అక్రమ లేఔట్‌లపై సీరియస్‌గా అధికారులు మందలిచ్చిన సందర్భాలు లేకపోలేదు. అదే క్రమంలో అప్పటి రిజిస్ట్రార్‌లను అక్రమ లేఔట్లలో డిటిసిపి లేఔట్ అనుమతులు లేకపోతే రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆదేశాలు కూడాజారీ చేశారు. ఏది ఏమైనప్పనటికీ వైరా మున్సిపాలిటీలో రియల్ వ్యాపారులు కొంతమంది లేఅవుట్లు అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునేందుకు అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




# జిల్లా ఫారెస్టు అధికారులతో డిప్యూటీ సిఎం భట్టి సమావేశం



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం జిల్లా ఫారెస్టు అధికారులతో సమావేశమయ్యారు. మధిర నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలపై ఆయన ఆరా తీశారు. మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలోని ఇనిద్రమ్మ చెరువు ప్రాంతాన్ని, జమలాపురం టెంపుల్ ప్రాంతంలో జమలాపురం అర్బన్ పార్క్, గుబ్బల మంగమ్మ తల్లి పర్యాటక ప్రాంతాలపై భట్టికి అధికారులు వివరించటం జరిగింది. మధిర నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటంతో పాటు సమీప గ్రామాల్లో ఉపాధి కల్పించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను భట్టి ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ శ్రీసిద్ధార్ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డిఓ మంజుల, ఎఫ్ఆర్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మజీద్‌ల్లో నమాజులు పఠించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ త్యాగం, స్నేహం, పవిత్రత, దయాగుణానికి ప్రతీకగా నిలిచిన పవిత్రమైన రోజు బక్రీద్ అని అన్నారు. ఇబ్రహీం సలాం వృద్యాప్తంలో లేకలేక ఒక కుమారుడు జన్మిస్తే ఆ పత్రుడుని కర్బాని చేయాలని అల్లా ఆదేశిస్తే వెంటనే అల్లా అజ్ఞను పాటిస్తూ కుమారుని కర్బాని ఇవ్వడానికి తీసుకెళడాడు. అలాంటి త్యాగానికి ఒడిగట్టిన ఇబ్రహీం సలాం దానికి ప్రతీకగా ముస్లీం సోదరులంతా బక్రీద్ నాడు పొట్టేలు, మేక పోతును గాని కుర్బాని చేసి, దానిని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదవారికి, మరోభాగం బంధువులకు, ఇంకో భాగం కుర్బాని ఇచ్చిన వారు ఉంచుకోవడం జరుగుతుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హిందూ, ముస్లీంలు అంతా సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షఫీ, అబ్బుల్లా, మునాఫ్, అజీం, సర్వరాజ్, అలీ భాష, అక్బర్, సిందా, షరీఫ్, అలీమ్‌ఖాన్, సలీం, రహీం, నవాబ్, రఫీ పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వాలు వసతి గృహ విద్యార్థుల సంక్షేమం మరిచాయని సంక్షేమ వసతి గృల విద్యార్థుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి కనీస సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి కాని ప్రభుత్వ అధికారులకు కాని చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. వసతి గృహ విద్యార్థుల పట్ల అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరించడంలో అంతర్యం ఏమిటన్నారు. వసతి గృహాల విద్యార్థి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, జిల్లా నాయకులు రాకేష్, రోహిత్, బాలాజీ, ప్రతాప్, ప్రభాస్, నవీన్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న తాండ్ర



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని తిమ్మంపేట పంచాయితీలోని తిమ్మంపేట గ్రామంలో శ్రీ కోదండ రామ దేవస్ధానం నందు 18వ వార్షికోత్సవ శాంతి కళ్యాణం మహోత్సవంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు కర్నాటి కాంతారావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఊటుకూరు జోగనందనం, దేశినేని మధుసూదన్, ముంతపూడి సత్యనారాయణ, దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు, తల్లులకు అండగా అంకుర

**-గర్భిణీలకు ప్రత్యేక రాయితీ**
**-మీడియా సమావేశంలో అంకుర వైద్యులు**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంకుర ఆసుపత్రి ఎల్లవేళల తల్లులకు, పిల్లలకు అండగా ఉంటుందని ఆసుపత్రి నిర్వహకులు చల్లగుండ్ల రాకేష్ తెలిపారు. మహిళలకు సంబంధించి అందించే వైద్య సేవల్లో భాగంగా ప్రత్యేక రాయితీలు ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అంకుర ఆసుపత్రి నూతన భవనానికి మార్చిన సందర్భంగా వైద్యుల దినోత్సవ సందర్భంగా రాయితీలను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నగరంలోని గొరిల్లా పార్కు ఎదురుగా ఉన్న భవనంలోకి ఆసుపత్రిని మార్చామని ఈ ఆసుపత్రిలో పెళ్లయిన జంటల గర్భం, వైద్య పరీక్షల నిమిత్తం గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవించే వరకు రాయితీలు ఇస్తామన్నారు. ప్రత్యేక ప్యాకేజీలను ఏర్పాటు చేసి ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నామని రాకేష్ తెలిపారు. డెలివరీ అయిన తర్వాత ఒకసారి ఉచితంగా కన్సల్టేషన్ కల్పించనున్నామని వ్యాక్సిన్‌లో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రూ. 2,650 విలువ గల టెస్టులన్నీ రూ.1,120లకు 30 ఏళ్లు పైబడిన వారికి రూ.6,350 టెస్టులను రూ.2,350కు చేస్తామని రాకేష్ తెలిపారు. సోమవారం అంకుర ఆసుపత్రిలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్యులు శ్వేత యుదిస్టిర్, నేలకుర్తి జొన్న, బోడేపూడి కల్పన, సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జెడ్‌పిటిసి సున్నం నాగమణి అన్నారు. సోమవారం ములకలపల్లి మండల పరిధిలోని మాదారం గ్రామంలో గల తన నివాసంలో ఆమె మాట్లాడుతూ 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో వర్షకాలం వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపధికంగా చేపట్టాలన్నారు. ప్రహరీ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ గోడలు నిర్మించి, బాలికలకు, బాలురకు బాత్ రూములు మంజూరు చేయాలని కోరారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

## - ఎంఎల్‌ఏ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని కరకవాగు ప్రాతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశిరావు అన్నారు. ఈ స,ందర్భంగా ఆయన సోమవారం కరకవాగు ప్రాంతంలో పర్యటించారు. ఇందులో భాగంగా పలువురు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల మాలలు వేసి, షాలువా కప్పి గౌరవంగా సన్మానించుకున్నారు. ఈసందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉన్న ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఈ ప్రాంతంలో నెలకొన్న అన్ని సమస్యలను క్రమంగా పరిష్కరించుకుందామని చెప్పారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి విన్నవించి వెంటనే మంజూరు చేయించుకుందామని తెలిపారు. అనంతరం గ్రామంలో తనకు పరిచయమున్న వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం వచ్చినందున మారుమూల ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఆరోగ్యాల పట్ల అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావైద్యంతో పాటు మౌళిక సదుపాయాలకు పెద్దపీట వేస్తోందని, కొత్తగూడెం నియోజకవర్గంలోని అన్ని ఆస్పత్రులో మందులు కూడా అందుబాటులోనికి వచ్చాయని, డయాల్సిసిస్ మిషన్లు కొత్తవి ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆరోగ్యంగా మార్చుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వానాథం, పాల్వంచ మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, గిరి, రాజేష్, నాయక్, మురళీనాయక్, వినోద్, నాగరాజు, పాషా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేనిని కలిసిన సుజాతనగర్ గ్రామస్తులు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** బక్రీద్ పర్వదినం సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యు లు కూనంనేని సాంబశివరావును సు జాతనగర్ గ్రామస్తులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సుజాతనగర్ గ్రామానికి చెందిన గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే సాంబశివరావు కు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పార్టీలకు అతీతంగా గ్రామ సమస్యల పరిష్కారం కోసం వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, సిపిఐ మండల నాయకులు బొడ్డు కేశవరావు, గ్రామ పెద్దలు బొడ్డు శివప్రసాద్, బుజ్జి, చింతలపూడి సాయి కుమార్, గురుజాల సీతయ్య, గురజాల శ్రీను, గంగాధర కోటి, చాగంటి వెంకటేశ్వర్లు, గడ్డం రామారావు, చారిపాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కున్నారు.గొల్లగూడెం ఈద్గా మైదానంలో బక్రీద్‌ను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లిం సోదరులు వచ్చి పాల్గొన్నారు. పిల్లలు, పెద్దలు ప్రార్థనల్లో పాల్గొని సత్ ప్రసంగం విన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు నగదు, దుస్తులు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టౌన్ ఏసిపి రమణమూర్తి, ఖానాపురం హవేలీ సిఐ భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ఏసిపి రమణమూర్తి, సిఐ భానుప్రకాష్‌ను సత్కరించారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి చిరునామా యోగ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నేటి ఆధునీక జీవన విధానానికి అలవాటు పడిన ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని వీటన్నింటికి సంపూర్ణ పరిష్కారమే యోగ అని, వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయాలని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్‌బాబు, కార్యదర్శి కొండమీద వెంకట్, కార్మిక నేత మందా వెంకటేశ్వర్లు, పాదం యోగా నిపుణులు సంధ్యా లు తెలిపారు. సోమవారం పెవిలియన్ మైదానంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్, పాదం యోగా ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిక్షణా నేపథ్యంలో ఆరోగ్యం పట్ల అవగాహణ కలిగించేందుకు పెవిలియన్ మైదానం నుండి పాత బస్టాండ్ వరకు పెద్ద సంఖ్యలో నడక సాదకులు, కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులతో కలిసి మెగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాదం యోగా నిపుణులు శోభాదేవి, మమత, అర్వపల్లి నిరంజన్, దామోదర్‌రెడ్డి, నర్సింహారావు, రామనాథం, వెంకట్‌బాబు, తెలంగాణ పోలీస్ ట్రైనర్ ఎం. బాబు తదితరులు పాల్గొన్నారు.

# పాయంకు మాతృవియోగం


## -నివాళులర్పించిన సిపిఐ నేతలు అయోధ్య తదితరులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మణుగూరు శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు తల్లి పాయం రాములమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐరాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాయంను పరామర్శించారు. పాయం కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు జంగం మోహన్‌రావు, డి.సుధాకర్, ఎ. రమేష్, ఎస్‌కె సర్వర్, ఎం. వీరయ్య, జి. వెంకటేశ్వర్లు, సీతారాములు, తోట రమేష్, బీమరాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

# రవికల డిజైన్ కెవ్వుకేక..!

## -మగ్గం వర్క్‌కు పెరుగుతున్న డిమాండ్
## -చీర కంటే బ్లౌజుకే ఖర్చు ఎక్కువ





**ప్రజాపక్షం/వైరా:** పెళ్లిళ్ళు పండుగలు ఎలాంటి శుభకార్యమైన ఏ సందర్భమైన చీరలు కొంటారు. బీరువాలో ఎన్ని చీరలు ఉన్నా ఇంకా కావాలనే అంటుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే అవి వారి ప్రాథమిక ఆస్తి, ఆ చీరలకు మరింత అంతాన్ని ఇచ్చేవి జాకెట్లు, ఆ జాకెట్లకు మగ్గం వర్క్ డిజైన్ తోడైతే వాటికొచ్చే లుక్కు చెప్పలేం. ఇప్పుడు కళ్ళు మిర్మిట్ల గొలుపే రకరకాల డిజైన్లను మగ్గం వర్క్ రూపంలో అందిస్తున్నారు. చీరలు జాకెట్లకు మగ్గం వర్క్ చేస్తే అదనపు ఆకర్షణ ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు ప్రతి మండలంలో మగ్గం వర్క్ పెద్ద ఎత్తున కొనసాగుతుంది. దీంతో మగ్గం వర్క్ చేసే కుటుంబాలు జీవనోపాధిని పొందుతూ జీవనాధారం మీద ఆధారపడుతున్నారు. మగ్గం వర్క్‌లో నైపుణ్యత పొంది కబోరంగా నేర్చుకొని ఆ తర్వాత రకరకాల డిజైన్‌లలో రకరకాల అంచులను మగ్గం వర్క్ రూపంలో అందాలు చేకూర్చే విధంగా మగ్గం పనులు చేస్తున్నారు. ప్రతిచోట ఇప్పుడు మహిళలు మెచ్చే విధంగా వారు నచ్చే విధంగా రకరకాల డిజైన్లు రూపంలో మగ్గం వర్క్ చేస్తున్నారు. చీరల కంటే బ్లౌజులకే ఎక్కువ ఖర్చు వస్తుంది. ప్రస్తుతం పట్టణం పల్లె అనే తేడా లేకుండా మగ్గంకు డిమాండ్ పెరగడంతో ప్రతిఒక్కరూ ఈ రకమైన మగ్గం ట్రెండ్స్‌కు ఆకర్షితులవుతున్నారు. ఇంటి వద్దనే ఉండి టైలరింగ్ చేసేవారు సైతం చీరలు, జాకెట్లు, డ్రస్సులపై రకరకాల డిజైన్లు వేసి అందిస్తున్నారు. అంటే ఇప్పుడు ట్రెండు ఏ విధంగా విస్తరిస్తుందో ఒక్కసారి అర్థం చేసుకోవచ్చు. పెళ్లిళ్ళు శుభకార్యాలు పండుగలు ఎలాంటి సందర్భాలు వచ్చినా మగ్గం పనులకు మంచి గిరాకి పెరిగింది. ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా కనిపించేందుకు ఆకర్షణీయమైన రకరకాల డిజైన్లను వేయించుకునేందుకు ఖర్చుకు సైతం వెనకాడడం లేదు. మగ్గంపై వస్త్రాన్ని అమర్చుకొని చిన్న చిన్న స్ప్రింగులు ముత్యాలు పూసలు వివిధ రకాల రంగురాళ్ళతో కావాల్సిన విధంగా నచ్చిన విధంగా డిజైన్లతో కనువిప్పు చేసే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఒక బ్లౌజ్‌కి మగ్గం వర్క్ చేయాలి అంటే మూడు నుంచి ఐదు రోజులు పడుతుందని మగ్గం వర్క్ నిర్వాహకులు తెలుపుతున్నారు. అలా మగ్గంపై తయారు చేసిన వస్త్రాలను ధరించేందుకు వీలుగా బ్లౌజులు కుట్టాలంటే మరో వారం రోజులు సమయం పడుతుంది. ఒక రకంగా చెప్పాలి అంటే చీర కంటే బ్లౌజ్ వర్క్ చేయడానికే ఖర్చు ఎక్కువగా వస్తుందని మగ్గం వర్క్ నిర్వాహకులు చెబుతున్నారు.

# పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

## -నీట్ అక్రమాలపై ప్రధాని స్పందించాలి
## -విద్యార్థులతో చెలగాటమాడుతున్న మోడీ సర్కార్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** యంబిబిఎస్ ఇతర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేసింది. సోమవారం నీట్ ఆరోపణలపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నీట్ పరీక్ష బీహార్‌లో ప్రశ్నా పత్రాలను రూ. 30 లక్షలకు విక్రయించారని ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్ ఆరోపించారు. 67 మందికి పరీక్షల్లో మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో నిగ్గు తేల్చాలని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఒకే కేంద్రం నుంచి పరీక్ష రాసిన ఎనిమిది మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం పేపర్ లీకేజీ అనుమానాలకు ఊతమిస్తుందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. నీట్ పై అసలు నిగ్గు తేల్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు కరుణ్, కార్తీక్, మణికంఠ, విష్ణు, నరేందర్, లాల్‌పాషా, రాకేష్, భూమిక, కావ్య, స్పందన పాల్గొన్నారు.